# "ఇక వెళ్ళొస్తానండీ!"



"ఇక వెళ్ళొస్తాను జానకమ్మగారూ! వచ్చి చాలా సేపయింది. తలుపేసుకోండి."

"పాపం ఇంటికి వెళ్ళి మీరు వంటా అదీ చూసుకోవాలి గావును"

"అవును. చూశారా! ఆ మాట నాకు జ్ఞాపకమే లేదు. పైగా బడినుంచి పిల్లలొచ్చే వేళయింది. కాఫీలయినా ఇవ్వాలి—వస్తాను. మీరోసారి రండి జానకమ్మగారూ—మాయింటి కొచ్చి ఎన్నాళ్ళయిందో!"

"వస్తాను. ఏదీ! చూస్తున్నారుగా కనకమ్మగారూ! పొద్దున లేచిన దగ్గర్నుంచీ వంట పనీ, ఆ పనీ ఈ పనీ—వీటితోనే సరిపోతోంది. మధ్యాన్నం కాస్సేపు నడుం వాలుద్దాం అనుకుంటానా—ఎవరో ఒకరొచ్చి ప్రాణం తీస్తారు."

"ఆ మాట నాతోనే చెప్పండి. నేను అనుభవిస్తూనే వున్నాను. రాత్రుళ్ళూ అంతే! ఓ రోజు ఒకడు, ఓ రోజు ఒకడు సినిమాలకు వెళ్ళడం, పదేసిగంటలకి రావడం. అప్పుడు వడ్డన్లు! అన్నీ అయి పడుకునే సరికి—పదకొండో, పన్నెండో...."

"ఆఁ! మళ్ళీ తెల్లారే లేవాలి. లేకపోతే పాలవాడు పిలిచి వెళ్ళిపోతాడు—పనిమనిషి ఓ కేక పెట్టి వెళ్ళిపోతుంది. వస్తున్నాను, లెండి—పోనీ, రాత్రి లేటుగా వచ్చిన వాళ్ళు, ఉదయం లేచి తలుపులు తీస్తారా—తియ్యరు."

"ఎందుకూ తీస్తారూ—వాళ్ళకేం పట్టింది? అన్నింటికీ ఇంటి ఇల్లాలుండనే వుందిగా. ఆఁ—వస్తా జానకమ్మగారూ—తలుపేసుకోండి."

"మంచిదండి....జోడు, జోడు వదిలేసి నట్టున్నారు."

"చూశారా! నా మతి మండ! ఇలాగే ననుకోండి. ఎన్ని జోళ్ళుపోయాయో, లెక్కలేదు. మళ్ళీ జోడు కావాలని అడిగితే—అరవై ఆరు తిట్లతో ఆరునెల్లు పడుతుంది."

"ఈ జోడు డిజైను బావుంది. ఎక్కడ కొన్నారూ?"

"కొనలేదు జానకమ్మగారూ. మా ఆడబిడ్డ ఆమధ్య ఢిల్లీనుంచి వచ్చింది చూడండి—అప్పుడు తీసుకొచ్చింది. అక్కడ మహ చవకట. కొలతలు ఒక్కటే కాబట్టి—సరిగ్గా సరిపోయింది."

"బావుందండీ! ఈసారి వచ్చినప్పుడు నాక్కూడా ఓ జత తీసుకురమ్మందురూ—డబ్బు ఇచ్చేస్తాను."

"అయ్యయ్యో—అలాగే—డబ్బుకేం భాగ్యం—తర్వాత చూసుకుందాం. అది మళ్ళీ డిసెంబర్లో గాని రాదనుకుంటాను."

"ఎప్పుడొస్తే అప్పుడే! ఇప్పుడేం అర్జంటు గనక! అహఁ—మీతో ఒకమాట చెప్పి ఉంచితే మంచిదని చెబుతున్నాను."

"అలాగేనమ్మా. ఇవాళే ఉత్తరం రాస్తాను. వస్తాను."

"మంచిది."

"అన్నట్టు ఆ విషయం మాత్రం మరిచిపోకండి జానకమ్మగారూ—అదే, నే చెప్పింది."

"అదా....ఆఁ ఆఁ....అలాగే తప్పకుండా చెబుతాను."

"ఏదో ఒకటి చూడమనండి పాపం, చాలా ఇబ్బందుల్లో వున్నారు."

"అలాగే, చెప్పారుగా. ఇంటికి రాగానే చెబుతాను."

"రేపో ఎల్లుండో మళ్ళీ వస్తాను. ఈలోపల కనుక్కుంటే చాలు."

"అలాగే!"

"వస్తానండీ. తలుపేసుకోండి."

"అన్నట్టు—ఆ చీరెలవాడు మళ్ళీ కనిపించాడా కనకమ్మగారూ? వెధవ, చాలామోసం చేశాడండీ! చీరె రంగంతా పోయి, వలవలా ఏడుస్తోంది."

"మా తమ్ముడికి చెప్పాను—'చూద్రా వాణ్ణి' అని! ఎక్కడికీ పోడు లెండి. మొహం కాల్చి మంగళారతివ్వనూ! నే కనుక్కుంటా లెండి-వస్తాను."

"రేపో ఎల్లుండో వస్తారుగా? ఈ లోగా వాడి అడ్రసు కనుక్కోమన్నారంటే...."

"కనుక్కోమంటాను. నాకూ తెలుసు. కాని వాడిప్పుడు ఆ అడ్రసులో లేడుట!"

"మోసగాళ్ళకి ఓ అడ్రసేమిటి కనకమ్మగారూ—రకరకాల పేర్లు, ఊర్లూ మారుస్తూనే వుంటారు. ఆ మధ్య ఇలాగే...."

"ఎందుకూ, నేను కనుక్కుంటానుగా—వెళ్ళొస్తాను."

"మంచిదండీ!"

"మీ పిల్లలు వచ్చేస్తున్నారు. మా వాళ్ళూ వచ్చేసే వుంటారేమో. టిఫిన్ ఏం చేశారు వీళ్ళకీపూట?"

"ఏదీ? బియ్యం పిండి వుంటే, కాస్త మజ్జిగలో నానబెట్టాను. ఏ అట్టో పోసి ఇస్తాను."

"నేనూ ఏదో చూడాలి. వస్తానండీ, అన్నట్టు జానకమ్మగారూ...."

—ఆర్. రేవతి